## క్లుప్తంగా

### నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

మైలార్‌దేవ్‌పల్లి: గగన్‌పహాడ్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఆదివారం విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కోత విధిస్తున్నామన్నారు. నేతాజీనగర్ ఇండస్ట్రీయల్, డొమెస్టిక్ ఏరియా, న్యూ సిటిజన్ కాంటా, శ్రీరామ్‌నగర్, రవి ఫుడ్స్, మురళీహోటల్, దుర్గా మాత ఆలయం తదితర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

**కాటేదాన్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో..**

మైలార్‌దేవ్‌పల్లి: కాటేదాన్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆప్కో కాలనీ, గాయత్రీ లెన్, టీఎన్‌జీవోస్ కాలనీ, గణేష్‌నగర్, పయోనీర్ స్కూల్, షమా టెంట్ హౌజ్, బాబా టెంట్ హౌజ్ తదితర ప్రాంతాలల్లో విద్యుత్ ఉండదన్నారు.

### 9న ముగ్గుల పోటీలు

మణికొండ: ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈసారి 9వ తేదీ సోమవారం కృషి ఫౌండేషన్, బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నామని ఉత్సాహవంతులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని అధ్యక్షురాలు రూపారెడ్డి కోరారు. మణికొండ మల్లన్న దేవాలయం రోడ్డులో ఉదయం 9గంటల నుంచి పోటీలు ఉంటాయని, మొదటి బహుమతి రూ. 5వేలు, రెండవ బహుమతి రూ.3వేలు, 3వ బహుమతి రూ.2వేలు ఇస్తామన్నారు. మరిన్ని వివరాలతో పాటు పేర్ల నమోదుకు.. స్పందన- 8639324826, సింధురెడ్డి -9133424950 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

### సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మణికొండ: ప్రభుత్వ పథకాలు అన్ని వర్గాల వారిని ఆదుకుంటున్నాయని ఎమ్మెల్యే టి. ప్రకాశ్‌గౌడ్ అన్నారు. శనివారం ఆయన మణికొండ మున్సిపాలిటీకి చెందిన ఉషారాణికి రూ. లక్ష ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ బీఆర్‌ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి, పార్టీ మహిళా అధ్యక్షురాలు రూపారెడ్డి, కౌన్సిలర్‌లు పి.శైలజ, లావణ్యనరేష్, నాయకులు దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

### ఆలయానికి వెండి పాత్ర బహూకరణ



మైలార్‌దేవ్‌పల్లి: కాటేదాన్‌లోని వెంకన్నగుట్టపై ఉన్న శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో దూద్‌బౌలి ప్రాంతానికి చెందిన దంపతులు లక్ష్మి, ప్రసాద్ వెండి పాత్రను అందజేశారు. వారికి ఆలయ కమిటీ కృతజ్ఞతలు తెలిపారు.

### వీధిదీపాలకు మరమ్మతులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ ఏసీపీ కార్యాలయం ఆవరణలో వీధి దీపాలు లేక చిమ్మచీకటిగా మారింది. ఇదే ఆవరణలో రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్‌తో పాటు ట్రాఫిక్ ఏసీపీ కార్యాలయం సాగుతుంది. కొన్ని రోజులుగా ఏసీపీ కార్యాలయం భవనం వద్ద వీధి దీపాలు వెలగడం లేదు. విషయం తెలుసుకున్న శ్రీనివాస సేవా సమితి వ్యవస్థాపకులు సాయి మాలిక్, టీఆర్‌ఎస్ పార్టీ నాయకులు నరేష్‌లు శనివారం జీహెచ్‌ఎంసీ సిబ్బందితో మరమ్మతులు చేయించారు.

### 17 నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్‌లోని టీటీడీ శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ తృతీయ వార్షిక బ్రహ్మోత్సవాలను ఈ నెల 17 నుంచి 27వ తేదీ వరకు నిర్వహిస్తామని టీటీడీ ఎల్‌ఏసీ చైర్మన్ భాస్కర్ రావు తెలిపారు. శనివారం ఆయన ఎల్‌ఏసీ కమిటీ ఉపాధ్యక్షుడు కోమటిరెడ్డి లక్ష్మి, వెంకట్ రెడ్డి, రవి ప్రసాద్, అధికారులతో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. బ్రహ్మోత్సవాల్లో నగర వ్యాప్తంగా పెద్ద ఎత్తున భక్తులు పాల్గొనే అవకాశం ఉండటంతో భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఇందుకోసం డెకరేషన్ కమిటీ, ఫుడ్ కమిటీ, ప్రొటోకాల్ కమిటీ, కల్చరల్ కమిటీ, రిసెప్షన్ కమిటీతో పాటు మరికొన్ని కమిటీలను వేస్తున్నామన్నారు.

# అభివృద్ధి ఘనత సీఎం కేసీఆర్‌దే..

**మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్**



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

మణికొండ: దేశంలో ఎక్కడా లేని విధంగా 41 కుల సంఘాల భవనాలను నిర్మించి వారిలో ఆత్మగౌరవాన్ని పెంపొందించిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని, మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. శనివారం ఆయన గండిపేట మండలం, కోకాపేటలో నిర్మాణంలో ఉన్న గొల్ల, కురుమల ఆత్మగౌరవ భవనాలను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ త్వరలోనే ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా భవనాలను ప్రారంభిస్తామన్నారు. ఆత్మగౌరవ భవనాలలో గొల్ల, కురుమల పేద పిల్లలు ఉండి ఉన్నత చదువులు చదువుకునేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. అనంతరం ఎమ్మెల్సీ, కురుమ సంఘం అధ్యక్షుడు యెగ్గె మల్లేశం మాట్లాడుతూ ఆత్మగౌరవ భవనాలలో విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల సౌకర్యాలను కల్పించి వారిని ఉన్నతాధికారులుగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు బి.లింగయ్య యాదవ్, ఫిష్ ఫెడరేషన్ చైర్మన్ డి. బాలరాజ్ యాదవ్, టీఎస్‌ఈడబ్ల్యుఐడీసీ చైర్మెన్ రావుల శ్రీధర్‌రెడ్డి, కుడా చైర్మన్ సుందర్‌రాజ్, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు నోముల భగత్, జైపాల్‌యాదవ్, బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బి. వెంకటేశం, జిల్లా కలెక్టర్ అమోయ్‌కుమార్, సీఈ అనిల్‌కుమార్, యాదవ సంఘం నాయకులు చింతల రవీందర్ యాదవ్, నార్సింగి మున్సిపల్ వైస్ చైర్మన్ జి.వెంకటేశ్‌యాదవ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ ఎం. ప్రవీణ్‌యాదవ్, గొల్ల, కురుమ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# బీసీల సమస్యలు పరిష్కరించాలి

**మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను కలిసిన బీసీ ఉద్యోగుల సంఘం**



మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు పూలమొక్క అందజేస్తున్న సభ్యులు

రాజేంద్రనగర్: బీసీల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ ముకురా చంద్రశేఖర్‌గౌడ్ కోరారు. శనివారం మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను ఆయన నివాసంలో కలిసి బీసీ ఉద్యోగుల సమస్యల గురించి వివరించారు. సీఎం కేసీఆర్‌కు బీసీ ఉద్యోగుల సమస్యలను వివరించి తగు చర్యలు తీసుకునేలా చేయాలని ఆయనను కోరామన్నారు. మంత్రికి పూల మొక్క అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా ఉద్యోగుల సంఘం అధ్యక్షురాలు రమా, వర్సిటీ బీసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు భిక్షపతి, కార్యవర్గ సభ్యులు సంతోష్, సాగర్ తదితరులున్నారు.

# సమస్యల పరిష్కారానికి సంఘటితంగా పోరాడాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న నాయకులు

బండ్లగూడ: రవాణా రంగ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సంఘటితంగా పోరాడాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.వీరయ్య అన్నారు. రవాణా రంగ కార్మికుల సంఘర్షణ యాత్ర చేవెళ్ల మీదుగా అప్పా చౌరస్తాకు చేరడంతో యాత్రకు గండిపేట మండల ట్రాన్స్‌పోర్ట్స్ కార్మికులు స్వాగతం పలికారు. తెలంగాణ రోడ్ ట్రాన్స్‌పోర్ట్స్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్, ఎస్.వీరయ్యలు మాట్లాడుతూ రవాణా కార్మికులందరికి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని అనేక రూపాలలో ట్యాక్స్‌ల పేరుతో ఫైన్స్ పేరుతో వసూలు చేస్తున్న దాంట్లో నుంచి కొంత అమౌంట్‌ను సంక్షేమ బోర్డు రాష్ట్రంలో ఏర్పాటు చేయాలన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం 2019 మోటర్ వాహన చట్టాన్ని మార్పులు చేయాలన్నారు. పెట్రోల్, డీజిల్ రేట్లు తగ్గించాలన్నారు. దేశంలో ఉన్నటువంటి రవాణా రంగ ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత ఉందన్నారు. చిన్న అడ్డాల దగ్గర ఆటోలు ఏర్పాటు చేసుకున్న కార్మికులకు అడ్డా సదుపాయం కల్పిస్తూ ట్రాఫిక్ వేధింపులు అరికట్టాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి భూపాల్, కురపాటు రమేష్, తెలంగాణ రోడ్ ట్రాన్స్‌పోర్ట్స్ వర్కర్స్ ఫెడరేషన్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి రుద్రకుమార్, అధ్యక్షులు రాములు, సీఐటీయూ రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యులు ఎల్లన్న, వీరన్న, కార్మికులు పాల్గొన్నారు.

# ఇంగ్లిష్‌లో ప్రావీణ్యం తప్పనిసరి



గణేష్‌నగర్ పాఠశాలలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

మైలార్‌దేవ్‌పల్లి: నేడు ఇంగ్లిష్‌లో ప్రావీణ్యం తప్పనిసరి అని , విద్యార్థులలో ఇంగ్లిష్ ప్రావీణ్యం పెంపొందించేందుకు మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో పోటీలు నిర్వహించనున్నట్టు మండలస్థాయి ఇంగ్లిష్ భాషా ఉపాధ్యాయుల అసోసియేషన్ అధ్యక్షులు మొగిలయ్య, ప్రమీద, సురేష్, నవారు మాణిక్యంరెడ్డిలు తెలిపారు. ఈ మేరకు రాజేంద్రనగర్ పట్టణ పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 8,9 తరగతి విద్యార్థులకు ఈ పోటీలను నిర్వహించామని , విజేతలు అమెరికా స్టాండెర్డ్‌లో మరో పరీక్ష రాయాల్సి ఉంటుందని ఎంపికైన విద్యార్థులకు ఉన్నత విద్య అవకాశాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో టీచర్లు జాన్సన్, శివరాంపల్లి, అత్తాపూర్, బుద్వేల్, రాజేంద్రనగర్ పాఠశాలల ఉపాధ్యాయులతో పాటు ఈఎల్‌టిఏ ఉపాధ్యాయులు షబీర్ అహ్మద్, నర్సింహా, సురేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

# 'అంగన్‌వాడీ' నూతన కమిటీ ఎన్నిక



నార్సింగిలో సమావేశమైన అంగన్‌వాడీ టీచర్‌లు, వర్కర్లు

మణికొండ: గండిపేట మండల అంగన్‌వాడీ టీచర్‌లు, వర్కర్‌ల నూతన కమిటీని శనివారం నార్సింగిలో ఎన్నుకున్నారు. జిల్లా అంగన్‌వాడీ టీచర్స్, వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి కవిత ఆధ్వర్యంలో మండల అధ్యక్షురాలిగా సుధ, కార్యదర్శిగా మీనా, కోశాధికారి జ్యోతి, సహాయ కార్యదర్శిగా విజయరాణి, ఉపాధ్యక్షురాలిగా మునిబాయ్, కార్యవర్గ సభ్యులుగా సరస్వతి, శ్రీలత, మంజుల, లతా, ఉమా, సుకన్య, సులోచన, శోభలను ఎన్నుకున్నారు. తమ డిమాండ్‌ల సాధనకు కలసికట్టుగా కృషి చేస్తామని వారు పేర్కొన్నారు.

## డ్వాక్రా మహిళలకు శిక్షణ



మాట్లాడుతున్న అధికారి

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలోని డ్వాక్రా మహిళలు ఆర్థికంగా రాణించేందుకు అవసరమైన శిక్షణను అందిస్తామని మణికొండ మున్సిపల్ కమిషనర్ కె.ఫల్గుణ్‌కుమార్ అన్నారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని మణికొండ గార్డన్ కాలనీలో డ్వాక్రా మహిళలకు హోంఫుడ్స్ తయారీ, ప్లాస్టిక్ వేస్టేజ్ మేనేజ్‌మెంట్‌లపై శిక్షణ ఇప్పించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి, కౌన్సిలర్‌లు డాక్టర్ వసంతరావు, పి.శైలజ, లావణ్య నరేష్, శీరో హోం ఫుడ్స్ ప్రతినిధి వర్మ, మెప్మా అధికారి పద్మ తదితరులు పాల్గొన్నారు.

# పాలప్యాకెట్లను ఎత్తుకెళ్లిన యువకుడు..

**పట్టుకున్న స్థానికులు.. పోలీసులకు అప్పగింత**

రాజేంద్రనగర్: సాయిబాబా ఆలయంలో పంచలోహ విగ్రహాన్ని దొంగతనం చేయడంతో పాటు పాలబూత్ నుంచి పాలప్యాకెట్లను ఎత్తుకెళ్లిన ఓ యువకుడిని స్థానికులు పట్టుకుని రాజేంద్రనగర్ పోలీసులకు అప్పగించారు. గురువారం నందిముస్లాయిగూడ సాయిబాబా దేవాలయంలో సిక్‌చౌనీకి చెందిన ఓ యువకుడు దేవాలయంలోకి ప్రవేశించి హుండీతో పాటు పంచలోహ సాయిబాబా విగ్రహాన్ని దొంగిలించాడు. ఈ విషయమై దేవాలయ కమిటీ సభ్యులు రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆలయంలోని సీసీ కెమెరాల్లో దొంగతనానికి సంబంధించిన దృశ్యాలు రికార్డు అయ్యాయి. దీంతో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. కాగా నందిముస్లాయిగూడ రహదారిపై ఉన్న పాలబూత్‌కు తెల్లవారుజామున పాల ప్యాకెట్ ఏజెన్సీలు రోడ్డుపై పాలప్యాకెట్లను డంప్ చేసి వెళ్తుంటారు.. ఈ క్రమంలో శనివారం తెల్లవారుజామున 4 గంటల ప్రాంతంలో కారులో వచ్చిన యువకుడు దాదాపు 60 పాలప్యాకెట్లను తన కారులో వేసుకుని ఉడాయించాడు. ఆ సమయంలో ఓ స్థానికుడు సెల్‌ఫోన్‌లో చిత్రీకరించి పాలబూత్ నిర్వాహకుడికి పంపించారు. కారు నెంబర్ ఆధారంగా కిషన్ బాగ్ ప్రాంతంలో ఉన్న యువకుడిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# ఘనంగా రవీంద్రభారతి పాఠశాల వార్షికోత్సవం

రాజేంద్రనగర్: అత్తాపూర్ రవీంద్రభారతి పాఠశాల వార్షికోత్సవం శనివారం రాత్రి కన్నుల పండుగగా జరిగింది. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. వివిధ పాటలకు అనుగుణంగా విద్యార్థులు చేసిన నృత్యాలు విశేషంగా అలరించాయి.కార్యక్రమంలో విద్యార్థులు వారి తల్లిదండ్రులతో పాటు ప్రిన్సిపల్ శశికళ, డీన్ ప్రియ మనీష్, మధుతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## గంజాయి విక్రేత అరెస్టు

రాజేంద్రనగర్: బతుకుదెరువు కోసం వలస వచ్చిన ఓ కార్మికుడు గంజాయిని విక్రయిస్తుండగా రాజేంద్రనగర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అతడి వద్ద నుంచి 480 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వెస్ట్ బెంగాల్‌కు చెందిన ప్రోలే హల్దర్ బతుకుదెరువు కోసం నగరానికి వలస వచ్చాడు. బండ్లగూడ టైమ్స్ స్కూల్ ప్రాంతంలో సెక్యూరిటీ గార్డుగా చేరాడు. స్వగ్రామం నుంచి వచ్చే సమయంలో తన వెంట కిలో గంజాయిని తీసుకువచ్చాడు. గంజాయి సేవించే ప్రోలే హల్దర్ విధులు నిర్వహిస్తు గంజాయి సేవించేవాడు. స్థానికులు గంజాయికి అలవాటు పడ్డవారు తమకు గంజాయి కావాలని కోరడంతో వారి నుంచి డబ్బు తీసుకోని విక్రయించడం ప్రారంభించాడు. ఇది లాభసాటిగా ఉండడంతో గంజాయిని విక్రయించడం ప్రారంభించాడు. సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ పోలీసులు శనివారం ఉదయం అతడిని అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద విక్రయానికి సిద్ధంగా ఉన్న 480 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకోని రిమాండ్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## భరతనాట్య ప్రదర్శన..



మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న హస్తకళా ప్రదర్శన సందర్శకులను ఆకట్టుకుంటుంది. ప్రదర్శనలో భాగంగా నాట్యాచార్యులు సుధావిజయ్‌కుమార్ శిష్యబృందం భరతనాట్య ప్రదర్శన ఇచ్చారు. ఇందులో పుష్పాంజలి, నటేశకౌతం, కీర్తన, మధురాష్టకం, దశావతారం తదితర అంశాలను ప్రదర్శించారు.

## సమన్వయంతోనే ట్రాఫిక్ సమస్య పరిష్కారం

గచ్చిబౌలి: ఐటీ కారిడార్‌లో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యను వివిధ విభాగాల అధికారుల సమన్వయంతోనే పరిష్కరించేందుకు వీలవుతుందని శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ కమిషనర్ జె.శంకరయ్య పేర్కొన్నారు. శనివారం వెస్ట్ జోనల్ కార్యాలయంలో ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాస్ రావు, మాదాపూర్ డీసీపీ శిల్పవల్లీతో కలిసి సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ జామ్ నుంచి వాహనదారులకు విముక్తి కలగాలంటే రోడ్ల విస్తరణ, జంక్షన్ల డెవలప్‌మెంట్, ఫుట్‌పాత్‌ల నిర్మాణం, విద్యుత్ స్తంభాలను తొలగించాల్సిన అవసరం ఉందని అధికారులు గుర్తించారు. గచ్చిబౌలిలోని క్యూ మార్ట్ నుంచి రాంకీ టవర్స్, డెలాయిట్, మైండ్ స్పేస్ జంక్షన్, ఐటీసీ కోహినూర్, ఖాజాగూడ జంక్షన్, ట్రిపుల్ ఐటీ జంక్షన్, బొటానికల్ గార్డెన్, సీఆర్ ఫౌండేషన్, కొత్తగూడ జంక్షన్, అంజయ్యనగర్ తదితర ప్రాంతాలను అధికారులు పరిశీలించారు. క్యూ మార్ట్ , దుర్గం చెరువు ఎన్‌సీసీ వద్ద విద్యుత్ స్తంభాల తొలగింపు టీఎస్‌ఎస్‌పీడీసీఎల్ తొలగించాలని సంబంధిత అధికారులకు సూచించారు. సీఆర్ ఫౌండేషన్, క్యూ మార్ట్ వద్ద రోడ్డు విస్తరణ, క్యూ మార్ట్ వద్ద డ్రెయిన్ స్లాబ్, బయోడైవర్సిటీ నుంచి లెదర్ ఫ్యాక్టరీ వరకు రోడ్డు విస్తరణ, ఫుట్‌పాత్, సైకిల్ ట్రాక్ ఏర్పాటు, లెదర్ ఫ్యాక్టరీ నుంచి గచ్చిబౌలి జంక్షన్ వరకు రోడ్డు విస్తరణ, ఫుట్‌పాత్, సైకిల్‌ట్రాక్ నిర్మించాలని శేరిలింగంపల్లి సర్కిల్ ఈఈని ఆదేశించారు. దుర్గం చెరువు ఎన్‌సీసీ రోడ్డు అభివృద్ధి, ఇనార్బిట్ మాల్ ఎదురుగా ఉన్న ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించాలని టీఎస్‌ఐఐసీ అధికారులకు సూచించారు. ఆయా విభాగాలు చేపట్టాల్సిన పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు. జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్, టీఎస్‌ఎస్‌పీడీసీఎల్, టీఎస్‌ఐఐసీ, వాటర్ వర్క్స్, ఆర్‌అండ్ బీ అధికారులు పాల్గొన్నారు.

# బీజేపీ జెండా ఎగరడం ఖాయం



కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ నియోజకవర్గంలో భారతీయ జనతా పార్టీ గెలుపును ఎవరు ఆపలేరని, రానున్న ఎన్నికల్లో నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగరడం ఖాయమని నియోజకవర్గ పాలక్ మర్రి శశిధర్‌రెడ్డి, నియోజకవర్గ ప్రాభారి సాయిప్రసాద్‌లు అన్నారు. రాజేంద్రనగర్ అసెంబ్లీ కన్వీనర్ పొన్నమోని మల్లేష్‌యాదవ్, కోకన్వీనర్ మహాలింగంగౌడ్ ఆధ్వర్యంలో బీజేపీ బూత్ కమిటీల వర్చువల్ వీడియో కాన్ఫరెన్స్‌ను సామ భూపాల్‌రెడ్డి గార్డెన్‌లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్, టీడీపీ, టీఆర్‌ఎస్‌లు అభివృద్ధి చేసింది ఏమీ లేదన్నారు. దాదాపుగా నాలుగున్నర లక్షల పైచిలుకు ఓటర్లు ఉన్న నియోజకవర్గంలో ఇప్పటి వరకు వంద పడకల ఆసుపత్రి తేలేకపోయారన్నారు. కేసీఆర్, కేటీఆర్, కవిత, హరీష్‌రావుల కబంధ హస్తాల నుంచి విముక్తి పొందే సమయం ఆసన్నమైందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ బూత్ కమిటీలు, రాష్ట్ర నాయకులు గుమ్మడి రామ్‌చంద్రారెడ్డి, ప్రేమ్‌రాజ్‌యాదవ్, టి.అంజన్‌కుమార్‌గౌడ్, వై.శ్రీధర్, ఎస్.మల్లారెడ్డి, ఎం.కొమురయ్య, లక్ష్మీనారాయణ, చంద్రయ్య, రాచూరి రాజశేఖర్, తోకల సుధాకర్‌రెడ్డి, కార్పొరేటర్లు తోకల శ్రీనివాస్‌రెడ్డి, మోండ్ర సంగీత గౌరీశంకర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రిజం స్కూల్‌లో సంక్రాంతి సంబరాలు



హరిదాసుల వేషధారణలో చిన్నారులు



సాంప్రదాయ దుస్తుల్లో విద్యార్థినులు

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని అలకాపురి టౌన్‌షిప్‌లోని ప్రిజం ఇంటర్నేషనల్ స్కూల్‌లో శనివారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, వారి తల్లులు ముగ్గుల పోటీలలో పాల్గొన్నారు. విద్యార్థులు హరిదాసు వేషధారణ, సాంప్రదాయ దుస్తులలో అలరించారు. బొమ్మల కొలువు ఏర్పాటు చేశారు. చిన్నారులకు భోగి పండ్లు పోయటం, పాలు పొంగించటం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న స్కూలు కరస్పాండెంట్ రామలింగం మాట్లాడుతూ పండగలు ఆనందం పంచటంతో పాటు సంస్కృతి, సాంప్రదాయాలను తెలియజేస్తాయన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

# విద్యుదాఘాతంతో మూగజీవాలు మృత్యువాత



మృతి చెందిన ఆవు

బండ్లగూడ: విద్యుత్ అధికారుల నిర్లక్ష్యానికి మూగజీవాలు మృత్యువాతపడుతున్నాయి. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రమాదభరితంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ వైర్లతో ఆవులు, గేదెలు, మేకలు మృతి చెందుతున్నాయని యజమానులు వాపోతున్నారు. అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోకపోవడంతో రోజురోజుకు సమస్య తీవ్రమవుతుంది.

**విద్యుత్ షాక్‌తో ఆవు మృతి...**

- బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని దర్గాఖలీజ్‌ఖాన్‌లో విద్యుత్ షాక్‌తో శనివారం ఓ ఆవు మృతి చెందింది. గిరి జాతికి చెందిన ఆవును కొన్ని నెలల క్రితం మల్లేష‌యాదవ్ రూ.1.50 లక్షలతో కొనుగోలు చేశాడు. రోజు మాదిరిగానే మేత కోసం ఆవును వదిలిపెట్టాడు. మేతకు వెళ్లిన ఆవుకు విద్యుత్ తీగలు తగిలి మృతి చెందిందన్నారు. గతంలో సైతం మూగజీవాలు మృతి చెందాయని వాపోయారు. అప్పులు చేసి ఆవులను కొనుగోలు చేసి కుటుంబాన్ని పోషించుకుంటున్నామన్నారు. విద్యుత్ అధికారులు స్పందించి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

**మూగజీవాలను బలిగొంటున్న వైనం...**

- కార్పొరేషన్ పరిధిలో గతంలోనూ అనేక మూగజీవాలు విద్యుదాఘాతానికి బలయ్యాయి. చెట్ల పొదల్లో ట్రాన్స్‌ఫార్మర్లు, వైర్లు ఉండడంతో ప్రమాదం పొంచి ఉంది. పొదల్లో ఉన్న ఆకులను తినేందుకు వెళ్లిన జీవాలు తీగలు తగిలి మృతి చెందుతున్నాయి.

**సమస్య పరిష్కరించాలి**

- ప్రమాదభరితంగా మారిన ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు, విద్యుత్ వైర్లను తొలగించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లకు దిమ్మెలను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. అలాగే ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని జీవాల యజమానులు కోరుతున్నారు.